క్లుప్తంగా

నాయకులకు రాఖీ కట్టిన మంత్రి సీతక్క



ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు మంత్రి సీతక్క జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం రాఖీలు కట్టారు. మండల పార్టీ అధ్యక్షుడు బొల్లు దేవేందర్ తోపాటు పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు సీతక్క రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

కమిటీ ఎన్నిక



ములుగు రూరల్: జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం ఆదివారం జిల్లా పార్టీ పూర్తిస్థాయి కమిటీని నియమించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా అడప భిక్షపతి, జినుకల కృష్ణాకర్, ఏనుగు రవీందర్, చెవుగోని స్వప్న, ప్రధాన కార్యదర్శులుగా శ్రీమంతుల రవింద్రాచారి, పూర్ణం నరేష్ నియామించారు. అలాగే అసెంబ్లీ కన్వీనర్‌గా జాడి వెంకట్, కార్యదర్శులుగా తిరుపతిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, అమర్, శ్రీనివాసరావు, రవీందర్, సురేష్, రఘురాం, మహేందర్, స్పోకెస్ పర్సన్స్‌గా సూర్యదేవర విశ్వనాథ్, దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, కోశాధికారిగా గంగిశెట్టి రాజ్‌కుమార్, ఆఫీస్ సెక్రెటరిగా దొంతి రెడ్డి రవిరెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు శ్రీనివాస్, సాయిబాబా, కుమార్, శ్రీహరిని నియమించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు.

వాహనాల తనిఖీ



వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఎదిర గ్రామ శివారుల్లో ఆదివారం పోలీసులు ఎస్సై కొప్పుల తిరుపతి రావు ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి అనుమానిత వ్యక్తుల వివరాలను సేకరించారు. ఈ తనిఖీల్లో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

సోదరభావాన్ని పెంపొందించుకోవాలి



ఏటూరునాగారం: సోదరభావాన్ని పెంపొందించుకోవాలని ఉమ్మడి వరంగల్ జిల్లా హిందూ పరషత్ విభాగ్ ప్రచారక్ వక్త విగ్నేశ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో రక్షా బంధన్ కార్యక్రమాన్ని చేపట్టారు. అన్ని వర్గాల ప్రజలు ఒకరికొకరు రక్షాబంధన్‌ను కట్టుకొని శుభాకాంక్షలు తెలిపారు. హిందువులంతా ఏకమై సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేశ్, ప్రవీణ్, ఇంద్రసింగ్, అలువాల శ్రీనివాస్, కత్తెర శ్రీనివాస్, నూక ప్రభాకర్, సూర్యనారాయణశర్మ, కోటి వెంకట్, సమ్మయ్య, నూతి రమేష్, ప్రవీణ్, లొటపెటల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రాఖీ పండగ సందడి

టేకుమట్ల: రక్షాబంధన్ సందర్భంగా సందడి ఆదివారం నుంచే మొదలైంది. వ్యాపారులు మండల కేంద్రంలో రాఖీ స్టాళ్లు ఏర్పాటు చేయడంతో మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు, ప్రయాణికులు మండల కేంద్రంలోని రాఖీ స్టాళ్లలో కొనుగోలు చేస్తున్నారు. పలు రకాల రాఖీలతో స్టాళ్లు అందరిని ఆకర్షిస్తున్నాయి. రాఖీలతో పాటు స్వీట్లు సైతం కొనుగోలు చేయడంతో స్వీట్‌హౌజ్‌లకు గిరాకీ లభిస్తుంద ని నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కంటెయినర్ బోల్తా..

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం సూరారం సమీపంలో మలుపు వద్ద ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌కు టూవీలర్ షోరూమ్‌కు కొత్త టూవీలర్స్ బైక్‌లను తీసుకువెళ్తున్న కంటెయినర్ ఆదివారం తెల్లవారుజామున బోల్తాపడింది. కాగా, డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని మహదేవపూర్ ఆస్పత్రికి తరలించారు.

సర్వాయి పాపన్న జీవితం ఆదర్శం

మంగపేట: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని గౌడ సంఘాల నాయకులు తెలిపారు. మండల కేంద్రంలోని వైఎస్ఆర్ సెంటర్‌లో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను ఏజెన్సీ గౌడహక్కుల సంఘం మండల అధ్యక్షుడు రావుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జెండాను శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బూర లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు కారుపోతుల నర్సయ్యగౌడ్ హాజరై పాపన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో గౌడకులస్తులందరూ ఏకమై సంఘటితంగా పోరాటం చేస్తే రాజకీయాలను శాసించే దిశగా ఎదుగవచ్చన్నారు. ఏజెన్సీలోని అన్ని మండలాల గౌడకులస్తులు ఐక్య పోరాటానికి కలిసి రావాలన్నారు. పోరాట యోధుడు పాపన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని అన్నారు. ఆయన పోరాట స్ఫూర్తిగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు రావుల సత్యం, లోడె శ్రీనివాస్, బండపెల్లి నర్సయ్య, చీకట్ల ఏకస్వామి, కారుపోతుల ఏకాంబ్రం, రావుల కొమరయ్య, చామకూరి కృష్ణయ్య, రామగాని నరేందర్, బొబోతుల మురళి, చామకూరి భీమయ్య, శ్రీనివాస్, రమేష్, రవీందర్, మల్లిఖారున్, గాజుల పవన్, ఈశ్వర్య, లోడె కృష్ణ పాల్గొన్నారు.

గోవిందరావుపేట: సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని మండల పరిధిలోని చల్వాయి గ్రామంలో గౌడ సంఘం అధ్యక్షుడు మాచర్ల ఎలేంద్రం, అన్నపురం సదయ్య, జిల్లా నాయకుడు బొనగాని సారయ్య, మండల నాయకుడు వత్సవాయి సారయ్య ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. అలాగే పస్రాలో సంఘం అధ్యక్షుడు జక్కు పెద్దరాజు, కార్యదర్శి బుర్ర వేణు గౌడ్ ఆధ్వర్యంలో, గోవిందరావుపేటలో సంఘం అధ్యక్షుడు కాసగాని భిక్షం, కార్యదర్శి వీరేశం ఆధ్వర్యంలో బస్టాండ్ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అన్యాయాన్ని ఎదురించేందుకు సర్వాయి పాపన్న గౌడ్ కనబర్చిన పోరాట తెగువ అనన్యసామన్యమైందని కొనియాడారు. పాపన్న గౌడ్ పోరాటాన్ని ఆదర్శంగా తీసుకోని బహుజనులంతా ఏకతాటి పైకి చేరి తమ హక్కుల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బూర సురేందర్, బొమ్మగాని శ్రీను, గోపగాని ఐలయ్య, మద్దెల ఐలుమల్లు, కొండేటి రాజు, బ్రహ్మం, నాగరాజ్, చెవుగాని అంజనేయులు, ఏరుకొండ రాములు, చారగాని రాము, అన్నపురం మల్లయ్య, బాలగాని చంద్రయ్య, కొత్త మల్లయ్య, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.



మంగపేట: పాపన్న జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు



చల్వాయిలో..

కాటమయ్య రక్షణ కిట్లు పంపిణీ

ములుగు రూరల్: సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో గీతా కార్మికులు కాటమయ్య కిట్ల పంపిణీ చేశారు. ఈ మేరకు ఆదివారం కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పులి నర్సయ్య, ప్రదాన కార్యదర్శి గుండబోయిన రవి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన పోరాటాల ఫలితంగానే కాటమయ్య రక్షణ కిట్లు సాధించామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్, బుర్ర శ్రీనివాస్, శ్రీధర్, నరేష్, గోవిందరాజులు, వేణు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



గోవిందరావుపేట: పస్రాలో..



ములుగు రూరల్: గీత కార్మికులకు కాటమయ్య కిట్లు ఇస్తున్న నాయకులు

ఆపదలో ఉంటే 100కు డయల్ చేయాలి



నేరాలపై వివరిస్తున్న ఎస్సై తాజొద్దీన్

ఏటూరునాగారం: ప్రజలు ఆపదలో ఉంటే వెంటనే డయల్ 100కు కాల్ చేయాలని ఎస్సై తాజొద్దీన్ అన్నారు. ఆదివారం మండలంలోని ముళ్లకట్ట రాంపూర్‌లో రాత్రి గ్రామస్తులతో ఎస్సై మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న నేరాల నివారణకు పలు సూచనలు చేశారు. మహిళలు ఆపదలో ఉన్నా, లేదా ఆకతాయిలుతో అవస్థలు పడ్డా వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో నేరాలు అదుపులోకి రావాలి అంటే సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం అన్నారు. గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు వస్తే ఎలాంటి సాయం, ఆశ్రయం ఇవ్వొద్దన్నారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతం కావడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

టేకుకలప స్వాధీనం



టేకు కలపను అటవీశాఖ కార్యాలయానికి తరలిస్తున్న అధికారులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని తిప్పాపురం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా తరలిస్తున్న టేకు కలపను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఆలుబాక సెక్షన్ అధికారి చంద్రమోహన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిప్పాపురం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా బులోరో వాహనంలో టేకు కలపను తరలిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. అటవీశాఖ తిప్పాపురం గ్రామ సమీపంలో అటవీ ప్రాంతంలోకి చేరుకునే సమయానికి అటవీశాఖ అధికారులను గమనించిన స్మగ్లర్లు వాహనాన్ని, పది టేకు దిమ్మలను అక్కడే వదిలి పెట్టి వదిలి అటవీలోకి పారిపోయారని తెలిపారు. టేకు కలపను బోలోరో వాహనాన్ని వెంకటాపురం అటవీశాఖ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న టేకు కలప విలువ రూ.రెండు లక్షల యాభై రెండు వేల రూపాయలు ఉంటుందని తెలిపారు. ఈ దాడుల్లో అటవీశాఖ సిబ్బంది మౌనిక, బేస్ క్యాంప్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

జైశ్రీరామ్ వాహన స్టిక్కర్ల పంపిణీ

ఏటూరునాగారం: మండల కేంద్రానికి చెందిన తాడూరి రఘు, తాడూరి దీనభాంధవస్వామి, గాదె లింగాచారి, కత్తెర శ్రీనివాస్ సహకారంతో వెయ్యి వాహన జై శ్రీరామ్ స్టిక్కర్లను ప్రజలకు ఆదివారం మండల కేంద్రంలోని రామాలయంలో ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి గ్రామంలోని పెద్దలు పెద్ద హాజరై స్టిక్కర్లను వాహనదారులకు అందజేశారు. ప్రతి వాహనదారుడు తన వాహనానికి జైశ్రీరామ్ స్టిక్కర్‌లను అంటించుకొని భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో కత్తెర శ్రీనివాస్, గౌరిశంకర్, నూక ప్రభాకర్, కోడి వెంకట్, శ్రీను, ప్రవీణ్, అలువాల శ్రీనివాస్, సూర్యనారాయణ, విగ్నేష్, ఇంద్రకర్, ప్రవీణ్, రాజేష్, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



వాహన స్టిక్కర్లు అందజేస్తున్న నిర్వాహకులు

ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

వెంకటాపురం(ఎం): మండల కేంద్రానికి చెందిన కావటి కార్తీక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులకు రామప్ప మెకానిక్ యూనియాన్ తరఫున రూ.31500లను అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎండి.అంకూస్, పాషా, నాగేష్, విఘ్నేష్, రమేశ్, అన్వర్, గణపతి, రఘు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీలో అర్హులైన రైతులకు అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న సతీష్

మంగపేట: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ పథకాన్ని అమలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు పల్నాటి సతీష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమాశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ ఒకేసారి చేస్తానని చెప్పి మూడు విడతలుగా ప్రకటించినా కూడా రైతులకు న్యాయం జరుగలేదన్నారు. అర్హులైన వేలాది మంది రైతులు ఆందోళనలో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పొడెం రవీందర్, నాయకులు లింగంపల్లి శ్రీనివాస్, ప్రశాంత్, దిడ్డి రమేశ్, సాంబయ్య, జానకీ రామ్, శ్రీను, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి

చిట్యాల: మండలంలోని గోపాలపూర్ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు సహకరించాలని ఎస్సై శ్రావణ్‌కుమార్ కోరారు. ఆదివారం గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి వారితో మాట్లాడారు. సీసీ కెమెరాలు గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉండేందుకు ఉపయోగపడుతాయని అన్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మందితో సమానమని అన్నారు. ఏఎస్సై సమ్మిరెడ్డి, పోలీస్ సిబ్బంది అస్లాం జానీ, గ్రామస్తులు మూల శంకర్‌గౌడ్, ఏకు రవీందర్, తణుకు శ్రీనివాస్, ఏరుకోండ రఘు, రాజేందర్, స్వామి, భాస్కర్, రాజేష్, లక్ష్మీనారాయణ, రాకేశ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై శ్రావణ్‌కుమార్

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత



వెంకటాపురం(కె): వెంకటాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో పోగుట్టుకున్న ఫోన్‌లను గుర్తించి బాధితులకు ఆదివారం పోలీసులు అందజేశారు. వెంకటాపురం ఎస్సై కొప్పుల తిరుపతి రావు తెలిపిపన వివరాలు ఇలా ఉన్నాయి. గత సంవత్సరం చొక్కాల గ్రామానికి చెందిన గొర్రెపు కృష్ణ, బీసీ మల్లిగూడెం గ్రామానికి చెందిన గగ్గురి రమేశ్, కొప్పుల మహేశ్, మండల కేంద్రానికి చెందిన మారిశెట్టి పార్థసారధి సెల్ ఫొన్లు పోగొట్టుకున్నారని తెలిపారు. ఈ మేరకు వారు ఫిర్యాదు చేయడంతో సీఈ ఆర్‌ఐ పోర్టర్ ద్వారా మొబైల్‌లను గుర్తించి బాధితులకు అందజేసినట్లు ఎస్సై తిరుపతిరావు తెలిపారు.

వైభవంగా పోచమ్మ బోనాలు



ఏటూరునాగారం: బోనాలతో వస్తున్న మహిళలు



వెంకటాపురం(కె)లో..

ఏటూరునాగారం: మండలంలోని పప్కాపురం గ్రామంలో గ్రామస్తులు పోచమ్మ బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. అమ్మవారికి బెల్లంతో పాయసం చేసి చీరె సారెలను సమర్పించి కొబ్బరికాయలను కొట్టి బోనాలతో మొక్కులు చెల్లించుకున్నారు.

ముత్యాలమ్మ బోనాలు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలో ఆదివారం వైభవంగా ముత్యాలమ్మ బోనాల పండుగను నిర్వహించారు. శ్రావణ మాసంలో ఆదివారం కావటంతో మండల పరిధిలోని శివాపురం, జక్కుల వారి వీధి, మరికాల గ్రామస్తులు ముత్యాలమ్మకు బోనాల పండుగ నిర్వహించారు. ముత్యాలమ్మకు బోనాలను ఎత్తుకోని ఊరేగింపుగా గుడికి వెళ్లి బోనాలు సమర్పించారు. పాడిపంటలు చల్లగా కాపాడమని కోరుతూ తమ మొక్కులను చెల్లించుకున్నారు.

మహిళలతో నిండిన బస్‌స్టేషన్



బస్ స్టేషన్‌లో బస్సు ఎక్కేందుకు పోటీ పడుతున్న మహిళలు

ఏటూరునాగారం: రాఖీ పండుగ సందర్భంగా పల్లెల నుంచి పట్టణాలకు, పట్టణాల నుంచి పల్లెలకు ఆడపడుచులు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సుల వద్ద కుస్తీ పడ్డారు. ఒక బస్సులో వంద నుంచి 150 మంది వరకు వెళ్లేందుకు కూడా వెనుకాడడం లేదు. అంతేకాకుండా ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం చేపట్టడంతో బస్సులు అన్ని కూడా మహిళలతో నిడిపోయాయి. నేడు(సోమవారం) రాఖీ పౌర్ణమి పండుగకు ఆడ పడుచుకులు ఏటూరునాగారం బస్టాండ్ వద్ద బస్సులోకి ఎక్కేందుకు ఆదివారం పోటి పడ్డారు. దీంతో బస్టాండ్ పరిసరాలు మొత్తం కూడా మహిళలతో నిండిపోయి కనిపించింది.

గుడుంబా స్వాధీనం.. నలుగురి అరెస్టు

వాజేడు: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి గుడుంబాను తీసుకువస్తున్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం టేకులగూడెం వద్ద ఆదివారం వాహనాలను తనిఖీ చేస్తుండగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి రెండు ద్విచక్ర వాహనాలపై ప్లాస్టిక్ కవర్లలో 160 లీటర్ల గుడుంబా తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. దీంతో వారిని అదుపులోకి తీసుకోవడంతో పాటు సారాను, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు చిన్న గొళ్లగూడెం గ్రామానికి చెందిన తాడూరి రవీందర్, ధర్మవరం గ్రామానికి చెందిన దాగం మధుసూదన్‌రావు, పేరూరుకు చెందిన తల్లడి ప్రశాంత్, పూసూరుకు చెందిన కురుసం నరేష్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెల్కిపారు. గుడుంబా విలువ సుమారు రూ.64 వేలు ఉంటుందని ఎస్సై పేర్కొన్నారు. హెడ్ కానిస్టేబుల్ సాంబశివరావు, కానిస్టేబుళ్లు నరేష్, మహేశ్వరరావు, వెంకటేశ్వర్లు, నవీన్ పాల్గొన్నారు.



నిందితులను చూపుతున్న ఎస్సై కృష్ణప్రసాద్

కోడి పందేల స్థావరాలపై దాడి

మంగపేట: మండలంలోని తిమ్మంపేట సమీపంలో కోడి పందేల స్థావరాలపై ఆదివారం దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై టీవీఆర్ సూరీ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కోడి పందేలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి పందెం కోడితో పాటు ఐదు సెల్‌ఫోన్లు, ఆరు ద్విచక్ర వాహనాలు, రూ.1700 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారిని విచారించి కోడి పందేల్లో పాల్గొన్న మిగిత వారిని త్వరలోనే అరెస్టు చేయనున్నట్లు ఎస్సై తెలిపారు.

గుండుంబా విక్రయదారులపై కేసునమోదు

మండంలోని రాజుపేట ఎస్సీ కాలనీలో గుడుంబా విక్రయాలు నిర్వహిస్తున్న ఇద్దరిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై టీవీఆర్ సూరీ తెలిపారు. గుడుంబా విక్రయాలు చేస్తున ఇద్దరి నుంచి 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

ములుగు రూరల్: అనుమానాస్పద స్థితిలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని మల్లంపల్లి పంచాయతీ పరిధి హుమ్మాయినగర్‌లో రెండు రోజుల క్రితం చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశ్వర్‌రావు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మహంకాళి (70) భార్య రెండు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి మహంకాళి అదే గ్రామంలో కుమారుడితో కాకుండా వేరేగా జీవనం కొనసాగిస్తున్నాడు. ఒంటరి జీవితం గడుపుతున్న మహంకాళి తన కుమారుడు రమేశ్ వద్ద భోజనం చేస్తూ కాలం వెళ్లదీస్తున్నాడు. ఈ క్రమంలో రమేశ్ రెండు రోజుల క్రితం తండ్రి నివాసానికి వెళ్లి అతడితో మాట్లాడాడు. అయితే రెండు రోజుల అనంతరం ఇంటి నుంచి దుర్వాసన రావడంతో చుట్టపక్కల వారి సమాచారంతో రమేశ్ తన తండ్రి ఇంటికి చేరుకుని అతడి మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ ఘటనపై వృద్ధుడి కుమార్తె శనిగచర్ల కొంరమ్మ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

రోడ్లపైకి పశువులను వదలొద్దు

కాటారం: పశువుల యజమానులు రోడ్లపైకి పశువులను వదలొద్దని పంచాయతీ కార్యదర్శి షగీర్‌ఖాన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో రోడ్లపై తిరుగున్న పశువులను పంచాయతీ సిబ్బంది స్థానిక గ్రామ పంచాయితీ ఆవరణలోని బంజరుదొడ్డికి తరలించారు. ఈ సందర్భంగా షగీర్‌ఖాన్ మాట్లాడుతూ.. పశువులు రోడ్లపై సంచరిస్తుండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో పాటు రాత్రి పూట వాహనదారులు గమనించక రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. మొదటి హెచ్చరికలో భాగంగా పశువులను బంజరుదొడ్డికి తరలించామని యజమానులు వచ్చి తమ పశువులను తీసుకెళ్లకపోతే గోశాలకు తరలిస్తామని పేర్కొన్నారు.



బంజరుదొడ్డిలోకి తరలించిన పశువులు